



# మనస్తత్వాలు

- కె. త్రివిక్రమరావు

కథ

భద్రాచలంలో బస్సు బయలుదేరింది. సెమీలగ్జరీ అవటంవల్ల ముందుసీట్లు పసుపురాసిన పాదాలవలె ప్రత్యేకతను సంతరించుకోలేదు. హడావుడిగా బస్సు ఎక్కిన నాకూ మా తమ్ముడికీ ఈ ఆలోచన ముందుగా రాలేదు.

డ్రైవరు వెనుక వరుసలోని ఐదవసీటులో కూర్చున్నాం ఇద్దరమూ. 'ఐదవతనం' నిలవదని మాకప్పుడనిపించలా.

"సార్! టిక్కెట్". వెంటనే పంచింగ్ శబ్దం. బస్సంతా రణగొణధ్వనిగా వుంది. ఎవరిగోల వారిది. డ్రైవరుకు ఎడంవైపు వరుస అయిపోయి మా వరుసలో ముందుసీటుకు వచ్చాడు.

"అమ్మా! మీరెక్కడికి?"

"విజయవాడ".

వెంటనే పంచింగ్ శబ్దం.

అసలే మే నెల. పైగా భద్రాచలం. బస్సు కదుల్తున్నా ఉక్కపోస్తోంది.

రెండోసీటులో ఒక్క ఆసామీ మాత్రం కూర్చొనివున్నాడు దొరలాగా.

ముందు ఖాళీలో నలుగురు ఆడవాళ్లు- అబలలేమో నిలబడేవున్నారు, కిమ్మనకుండా.

"ఏంబాబూ! ఇక్కడ కూర్చున్నావేమిటి? ఇవి ఆడవాళ్ల సీట్లు. లేవండి. లేచి వెనక్కు వెళ్లండి సార్" కండక్టర్ అభ్యర్థన.

"స్త్రీలను గౌరవిద్దాం. వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం" లాంటి నినాదాలు ఒక్కసారి గుర్తువచ్చి నవ్వొచ్చింది నాకు. విశేషమేమంటే వీటిని వ్రాసేవారు వ్రాయించేవారూ ఎవరూ స్త్రీలు కాకపోవటమే.

మా చిన్నతనంలో బస్సుల్లో అలా వ్రాసివుండేవి కావు. స్త్రీలు రాగానే ఎవరికివారే వాలంటరీగా లేచి సీట్లిచ్చిన రోజులవి. మగవాళ్లు ఇప్పటిలా ముఖం తిప్పుకునే వాళ్లు కారు. నిలబడ్డ స్త్రీ మచ్చుకైనా బస్సులో కనబడేది కాదు.

రోజులుమారాయి అనటంకన్న బుద్ధులు మారాయి అనటం సబబేమో? అసలు అగౌరవపరుస్తున్నామనే భావమే మనలో లేకపోతే స్త్రీజనోద్ధరణకు సంబంధించిన స్లోగన్స్ ఇలా వ్రాయటమెందుకో.

తమ బలహీనతల్ని కప్పిపుచ్చుకోటానికి పురుషప్రపంచం ఎంత తాపత్రయపడుతుందో తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది.

రెండుక్షణాల్లో నాలోసాగిన ఆలోచనాపరంపర కండక్టరు అభ్యర్థనకు ఆగ్రహోదగ్రుడైన ఆసామీ అరుపుల్లాంటి మాటలకు ఆగిపోయింది. అటు చూశానొకసారి.

"ఎక్కడ రాసున్నాయండీ? ఎక్కడ? ఆడవాళ్ల సీట్లట".

"ఈ బస్సులో రాసివుండవయ్యా. అర్థంచేసుకోవాలంతే" కండక్టరు జవాబు.

"రాసివుండనప్పుడు ఎక్కడ ఎవరైనా కూర్చోవచ్చు". వాళ్లు నిలబడివుంటే, మీరు కూర్చోవటానికి వీల్లేదు. లేవండి".

అతడు సగం లేచి సగం కూర్చొని ఇంకా ఏదో అనబోతున్నాడు. చూస్తే చదువుకున్నవాడిలానే కనిపిస్తున్నాడు.

కండక్టరు కరుకైన పిండం. కమాండరైపోయాడు.

"టైం వేస్ట్ చెయ్యకండి. లేవండి. ఇంతకీ మరెక్కడికి?"

"విజయవాడ".

"నలభైఎనిమిది. ఊ. తియ్యండి" అంటూనే టిక్కెట్టు కొడుతున్నాడు కండక్టరు.

విధిలేక లేచాడు ఆ ఆసామి ఏభై నోటిస్తూ.

"రెండు రూపాయలివ్వాలి. మీరు వెనక్కు నడవండి. అమ్మా మీ ఇద్దరు ఈ సీట్లో కూర్చోండి".

**"స్త్రీలను గౌరవిద్దాం. వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం" లాంటి నినాదాలు ఒక్కసారి గుర్తువచ్చి నవ్వొచ్చింది నాకు. విశేషమేమంటే వీటిని వ్రాసేవారు వ్రాయించేవారూ ఎవరూ స్త్రీలు కాకపోవటమే.**

**“చూడు బాబూ! పార్టీలు ఏవైనా కావచ్చు. మనస్తత్వాలు నీవంటివి కావటం వల్లనే ప్రభుత్వాలు ఇలా ఏటేటా కుప్పకూలుతున్నాయి”. బిత్తరపోయిన అతడు మాటలు వెతుక్కునేలోపే దూరమైపోయాం నేనూ మా తమ్ముడూ.**

ఆసామీ అవాక్కయి దోరు తిన్నగా అక్కడే నిలబడ్డాడు.

“వెనక్కు పదస్వామీ. నన్ను వాగించకు”.

“అమ్మా మీరెక్కడికి?” తనపని తాను చేసుకుపోతున్నాడు కండక్టరు.

హతాశుడైన ఆసామీ దిగాలుగా మేంకూర్చున్న ఐదవసీటు వెనుకకువచ్చి రాడ్ పట్టుకు ఆనుకుని నిలబడ్డాడు.

బస్సు కుదుపుకు ఒకటి రెండుసార్లు తల రాడ్‌కు కొట్టుకుందేమో? మెరుపులాంటి ఆలోచన వచ్చిందతడికి.

“కండక్టరుగారూ! ఐదోసీటు వరకూ లేడీస్ సీట్లేకదా! వీళ్లనీ లేపండి. రూలంటే అందరికీ రూలే”.

నాకు నవ్వొచ్చింది. అప్పుడర్థమైంది. అతడు నేననుకొన్నదానికన్నా ఎక్కువ చదువుకున్నాడని.

“లేపుతాను సార్! మీరేం కంగారుపడకండి”.

“మనిషికో రూలా? ముందర ఆ ఇద్దరు ఆడవాళ్లూ నిలబడే ఉన్నారుగా. వీళ్లని లేపండి”. అతని బి.పి. మరికొంచెం పెరిగింది.

కండక్టరుకూ పెరిగింది ఈసారి.

“వాళ్లేం నా బాబాయి కొడుకులు కాదు. లేపుతా ఆగవయ్యా”. ఒక్క అరుపు అరిచాడు.

బస్సులో వారికి మంచి వినోద ప్రదర్శన.

ఈలోపు మాదాకా వచ్చాడు, టిక్కెట్లు కొడుతూ.

“సార్! మీ ఇద్దరూ కూడా లేవండి”.

“మీరెక్కడికి?”

క్షణం కూడా ఆలోచించకుండా ఇద్దరం లేచాం.

“విజయవాడకు రెండు టిక్కెట్లు”. అంటూ మేమూ నిలబడ్డాం.

ముందు నిలబడివున్న ఇద్దరు ఆడవాళ్లనూ కేకేసి మేం ఖాళీచేసిన సీట్లల్లో కూర్చోబెట్టాడు కండక్టరు.

ఆసామీ ఆర్భాటానికి బ్రేకు పడింది.

మేంకూడా అతనిలా గొడవ పడతామనుకున్న అతనివంక చూసి ఒక చిరునవ్వు నవ్వాను నేను అప్రయత్నంగా. అతడి ముఖం మాడిపోయిన పెనంలా సెగలుక్కింది.

ఈ గొడవంతా ముగిసి కండక్టరు టిక్కెట్లు కొట్టే ప్రహసనం పూర్తయ్యేసరికి బస్సు అదేదో స్టేజిలో ఆగింది. మేం ఖాళీచేసిన సీట్లలోని స్త్రీలు ఇద్దరూ ఆ స్టేజివద్ద దిగిపోయారు.

యథాతథంగా మా సీట్లు మేమాక్రమించాం. మా మిత్రుడొకడు తరచూ అనే సామెతొకటి గుర్తొచ్చి పైకే అనేశాను.

“పగవాడింట్లో పది విస్తళ్లు లేస్తే మనకానందం”. బస్సులో జనం భళ్లున నవ్వారు. ఆసామీ ముఖం చూడాలి నాసామిరంగా.

ప్రయాణం సాగుగూతా పాపమా ఆసామి సీటుకోసం ప్రయత్నిస్తూ విఫలమవుతున్నాడు. దాదాపుగా బస్సులోనివారంతా విజయవాడ ప్రయాణీకులే. అదృష్టంకొద్దీ ఇబ్రహీంపట్నంలో ఇంకొక పావుగంటలో జర్నీ ముగుస్తుందనగా అతనికి సీటు దొరికింది. కూర్చొని నిట్టూర్చాడు.

చిత్రమో విధివైచిత్రమో ఆడవాళ్ల కోసమంటూ మళ్లీ మేం సీట్లు ఖాళీ చేయవలసి రాలేదు.

ఈ సంఘటనతో ఆలోచనలు ప్రవాహమల్లే దొర్లుతూనే వున్నాయి నా మనస్సులో. మానవ మనస్తత్త్వాల మీద విశ్లేషణలు సాగుతూనే వున్నాయి మదిలో, బస్సుతోపాటు.



సీట్లాటముగిసి బస్సు విజయవాడ చేరింది. నాకూ బి.పి. పెరిగిందేమో తెలియదు. ఆగినబస్సు దిగుతూ ప్రస్తుతం దేశంలోని పరిణామాలకు కారణం కనుక్కున్న శాస్త్రజ్ఞుడిలా ఫోజుపెట్టి అన్నాను ఆ ఆసామితో. అఫ్‌కోర్స్ చిరునవ్వు చెదరకుండానే.

ఏమిటో అనకుండావుందామని ఎంత ప్రయత్నించినా ఆగలేకపోయాను.

“చూడు బాబూ! పార్టీలు ఏవైనా కావచ్చు. మనస్తత్త్వాలు నీవంటివి కావటం వల్లనే ప్రభుత్వాలు ఇలా ఏటేటా కుప్పకూలుతున్నాయి”. బిత్తరపోయిన అతడు మాటలు వెతుక్కునేలోపే దూరమైపోయాం నేనూ మా తమ్ముడూ.

కథ

## ఇల్లు ఒళ్ళు వెచ్చగా...

ఇది చలికాలం. ఇల్లు ఒళ్ళు వెచ్చగా ఉండాలని కోరుకుంటాం. చలి చర్మాన్ని కోసినప్పుడల్లా తిట్టుకుంటాం. రగ్గులు, రజాయ్‌లు కప్పుకుని వేడివేడి టీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు ఈ హేమంతం కల్పించిన మధురానుభూతిని అభినందిస్తాం. ఇట్లా అటు కించిత్ కోపాన్ని అటు బోలెడంత ఆనందాన్ని కలిగించే ఈ కాలానికి సలామ్ చేయాలని పిస్తుంది.



ఉదయం లేవగానే మంచు బిందువులు మనల్ని పలకరిస్తుంటాయి. పుష్పాలు తడిసి ముద్దై అగుపిస్తాయి. పిచ్చుకల శబ్దాలు మనసుకు గిలిగింతలు పెడుతుంటాయి. ఆలస్యంగా లేచిన సూర్యుణ్ణి చూసి చిరునవ్వులు చిందిస్తాం. వేడివేడి టీ ముగించుకుని రాత్రి తొడిగిన ఉన్ని దుస్తులను తీసి కొక్కానికి తగిలిస్తాం. మన ముఖం అద్దంలో చూసుకున్నప్పుడు తాజాగా కనిపిస్తుంది. ఆ రోజు ప్రారంభానికి అది శుభసూచకమనిపిస్తుంది.